నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, గురువారం 19 డిసెంబర్ 2024 | MAHABUBABAD

- ఊరు విడిచి వెళ్తారా.. మరో పోరాటం చేస్తారా..
- కాస్తులో ఉండడం తప్ప ఏ ఆధారం లేని అన్నదాతలు
- మంత్రి శ్రీధర్‌బాబు రైతులకు న్యాయం చేస్తాడా?
- అక్రమార్కులను అందలం ఎక్కిస్తాడా?
- జిల్లాలో జోరుగా కొనసాగుతున్న చర్చ
- దక్కన్‌కు భూముల రిజిస్ట్రేషన్‌పై అధికారుల విచారణ
- తహసీల్దార్‌పై చర్యల బాధ్యత సీసీఎల్‌ఏకు అప్పగింత

నమస్తే ఎఫెక్ట్

పలిమెల రైతులకు న్యాయం జరిగేనా?

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దుల్లోని పలిమెల గ్రామంపై దక్కన్ సిమెంట్స్ పడగ కమ్ముకుంది. ఒకటి కాదు.. రెండు కాదు.. సుమారు 200 ఎకరాల భూమిని 60 ఏళ్లుగా కాస్తులో ఉన్న రైతుల నుంచి లాక్కునేందుకు అంతా సిద్ధమైంది. ఇప్పటికే 102 ఎకరాలు దక్కన్ సిమెంట్స్ పేరిట రిజిస్ట్రేషన్ కాగా, మరో 100 ఎకరాలు స్లాట్ బుకింగ్‌లో ఉంది. వీటి రిజిస్ట్రేషన్లను ప్రస్తుతం ప్రభుత్వం నిలిపివేసింది. ఈ తతంగమంతా కాస్తులో ఉన్న రైతులకు తెలియకుండానే కొనసాగింది. గతంలోనే ధరణిలో పేర్లు నమోదు చేయించుకున్న అక్రమార్కులు ప్రస్తుతం ఆ భూములను దక్కన్‌కు ధారాదత్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పోరాట ఫలితంగా 200 ఎకరాలు అక్రమార్కుల చెర నుంచి విముక్తి పొందినట్లయింది. ఈ బాగోతమంతా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కనుసన్నల్లో నడుస్తున్నదనే ఆరోపణల నేపథ్యంలో ఆయన రైతులకు న్యాయం చేస్తారా? అక్రమార్కులను అందలం ఎక్కించి దక్కన్ సిమెంట్స్‌కు భూములు కట్టబెడతాడా? అనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నది. కాగా, ఇంత జరుగుతున్నా మంత్రి శ్రీధర్ బాబు మాత్రం ఇప్పటివరకు పెదవి విప్పలేదు. రైతులంతా 60 ఏళ్లుగా ఈ భూముల్లో కాస్తులో ఉండడం తప్ప వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఆ భూములను వదులుకుంటే పైసా చేతికి వచ్చే పరిస్థితి లేదు. బతుకు దెరువుకు వేరే దారి లేక పొట్ట చేతపట్టుకుని ఊరు విడిచి వెళ్లాల్సిందేనా? లేదా లగచర్ల లాగా రైతులు మరో పోరాటం చేయాల్సిందేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తహసీల్దార్ పాత్రపై విచారణ

పలిమెలలో భూముల రిజిస్ట్రేషన్‌పై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్ ఈ ఉదంతంపై విచారణ జరిపారు. ఇక్కడి రైతులు కాస్తులో ఉన్న భూములను 2008లో మంథని, ధన్వాడ, లద్నాపూర్ తదితర గ్రామాల నేతలు రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇప్పుడు గుట్టు చప్పుడు కాకుండా దక్కన్‌కు కట్టబెట్టారు. అసలు దక్కన్ సంస్థ ఇక్కడికి ఎలా వచ్చింది? దీని వెనుక అసలు సూత్రధారులెవరు? భూముల రిజిస్ట్రేషన్ చేయిస్తున్నది ఎవరు? తహసీల్దార్ తన కార్యాలయంలో కాకుండా వేరే చోట రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం ఏముంది? తెర వెనుక ఎవరున్నారు? అనేది బహిరంగ రహస్యంగా ఉంది. ఈ విషయమై సబ్ కలెక్టర్ రైతుల నుంచి వివరాలు సేకరించి తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలను కలెక్టర్‌కు విన్నవించగా, అతడిపై చర్యల బాధ్యతలను సీసీఎల్‌ఏకు అప్పగించారు.

ప్రాణాలు పోయినా భూములు వదలం

ఇక్కడ మా తాత, తండ్రుల నాటి నుంచి భూమిని కాస్తు చేసుకుని బతుకుతున్నం. మా వద్ద అప్పుడు ఇచ్చిన తోక పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. మా భూములు లాక్కోవద్దు అని చాలా సార్లు మంత్రి శ్రీధర్‌బాబును కలిశాం. అయినా స్పందించకపోగా మాపై కేసులు పెట్టించిండు. మా భూములు దక్కన్ కంపెనీకి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు? మంత్రికి తెల్వకుండా వందల ఎకరాలు కంపెనీ పేరుతో ఎలా రిజిస్ట్రేషన్ అయితది? మా ప్రాణాలు పోయినా భూమిని వదులుకోం. మాకు ఈ భూమే దిక్కు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి. పదేళ్లు కాస్తులో ఉంటే దళిత, గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని చట్టంలోనే ఉంది. మరి 60 ఏళ్లుగా ఈ భూమలనే నమ్ముకుని బతుకుతున్నం. మాకు ఈ చట్టం వర్తించదా?

– పెద్ది పోచయ్య, రైతు, బోడాయిగూడెం

ప్రజా సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్

- విపక్షాలను విమర్శిస్తూ కాలం వెల్లదీస్తున్న ప్రభుత్వం
- ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తి చేయలేదు
- సర్కారు వైఫల్యాలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మాజీ మంత్రి దయాకర్‌రావు

ఇల్లందలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, డిసెంబర్ 18: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఇల్లందలో నిధుల లేమితో మధ్యలో నిలిచిపోయిన గౌడ కమ్యూనిటీ భవనాన్ని కుల సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గౌడ సంఘానికి కమ్యునిటీ భవనాన్ని మంజూరు చేయడంతో భవనానికి స్లాబ్ వేయించామని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల సమక్షంలోనే భవనాన్ని నిర్మించి బిల్లులు రికార్డు చేసినా మంజూరు చేయడం లేదని వారు వివరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కుల సంఘాల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి కమ్యూనిటీ భవనాలను మంజూరు చేశామన్నారు. భవన నిర్మాణాలు మధ్యలో ఉన్నందున ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా కుల సంఘాల ప్రతినిధులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అలాగే, ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం విపక్షాలను విమర్శిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆయన ప్రభుత్వ నేతలను విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు ఏ ఒక్క గ్రామంలో కూడా పక్కా గృహాలను మంజూరు చేయకపోగా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. ప్రధానంగా రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు, రైతులు తగిన విధంగా బుద్ధి చెబుతారని ఎర్రబెల్లి పేర్కొన్నారు. కార్యకర్తలు పార్టీ కోసం పనిచేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. అలాగే, ఇల్లంద అయ్యప్ప ఆలయాన్ని ఆయన సందర్శించి అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ సర్పంచ్ కుమారస్వామి, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలివ్వాలి

శాసనమండలిలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 18 : ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు అందించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారని అతి తక్కువ వేతనం నెలకు రూ.11,500లు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ నర్సరీల సంరక్షణ, మొక్కల పెంపకం, ఈజీఎస్ వంటి కార్యక్రమాలు కూడా వారే చేస్తున్నారని చెప్పారు. కేవలం ధర్నాలు చేస్తే వేతనాలు పెంచడం కాకుండా తక్కువ వేతనాలున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే వేతనాలు పెంచాలన్నారు.

అజంజాహి మిల్లు కార్మిక భవనం కబ్జాపై అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన అధికారులే తమ ప్రాథమిక విధిని మరచి విలువైన స్థలాన్ని కూల్చినా చర్యలు తీసుకోకుండా చోద్యం చూడడంపై అనుమానాలు రేకేతిస్తున్నది. రూ.కోట్లు విలువ జేసే 1450 గజాల భూమిలో ఓ వ్యాపారి ప్రైవేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సహకరించడం కార్మికలోకం భగ్గుమంటున్నది. భూమిపూజ జరిగి రెండు రోజులైనా అధికార యంత్రాంగం స్పందించకుండా మౌనం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు కార్మికులకు మద్దతుగా నిరసనలు తెలుపుతున్నాయి. కబ్జాకోరులకు శిక్షించి, మిల్లు భూములను పరిరక్షించేదాకా ఉద్యమం తీవ్రతరం చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. *- వరంగల్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

మిల్లు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ (ఫైల్)

కబ్జాపై మౌనం

- చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారుల చోద్యం
- అధికారుల తీరుపై విమర్శలు
- అజంజాహి కార్మిక భవన్ కూల్చివేతపై భగ్గుమంటున్న కార్మిక లోకం
- ప్రైవేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి భర్త అండదండలపై ఆగ్రహం
- మద్దతుగా నిలిచి నిరసన తెలుపుతున్న రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు
- మిల్లు భూమి పరిరక్షించుకునేందుకు ఉద్యమ కార్యాచరణ

కార్మిక సంఘాల భవనాన్ని కూల్చుతున్న సిబ్బంది (ఫైల్)

వరంగల్‌లో అజంజాహి మిల్లు కార్మికుల కోసం 75 ఏండ్ల క్రితం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించగా అప్పటినుంచి అందులోనే కార్మిక భవనం ఉన్నది. అయితే రూ. కోట్ల విలువ చేసే 1450 గజాల భూమిలో మంత్రి భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అండదండలతో ఓ వ్యాపారి రెండు రోజుల క్రితం కాంప్లెక్సు నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఆ వెంటనే ఈ భవనాన్ని కూల్చివేశారు. అజంజాహి మిల్లు స్థలం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందని గతంలో పలుమార్లు ప్రకటించిన అధికార యంత్రాంగం ఇప్పుడు ప్రైవేట్ కాంప్లెక్సు నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేత ఒత్తిడి లేదా ప్రైవేట్ వ్యాపారికి సహకరించే ఉద్దేశంతోనే అధికారులు కబ్జా విషయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

కార్మికుల పోరుబాట..

కార్మిక భవన్‌ను కూల్చి ప్రైవేట్ కాంప్లెక్సు పనులు చేపట్టడంపై కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు నిరసన బాట పట్టాయి. ఆ స్థలం కార్మికులకే ఉం టుందని, ప్రైవేట్ వ్యక్తులకు ఇక్కడ హక్కులు ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నాయి. కార్మిక భవనం స్థలం కబ్జాకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నాయి. మిల్లు ఉన్నప్పుడు కార్మికుల కోసం కేటాయించిన భవనం స్థలాన్ని తమకే ఇచ్చేలా చేస్తానని ప్రకటించిన మాజీ ఎమ్మెల్సీ ఇప్పుడు దగ్గరుండి వ్యాపారికి అప్పజెప్పేలా వ్యవహరిస్తుండడంపై ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కబ్జా విషయమై ప్రభుత్వ పెద్దలను కలిసి ఫిర్యాదు చేస్తామని, అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. కాగా, అజంజాహి మిల్లు కార్మికుల భవనం కూల్చివేత, అందులో కమర్షియల్ కాంప్లెక్స్ పనులు చేపట్టడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకించగా సీపీఎం, ఎంసీపీఐ, సీపీఐ ఎంఎల్, బీజేపీ నేతలు కూడా ఆ స్థలంలోనే నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలు చర్చించుకునేందుకు 75 ఏండ్ల క్రితం అజంజాహి మిల్లు యాజమాన్యం యూనియన్ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని.. మంత్రి భర్త స్వయంగా ఓ ప్రైవేటు వ్యాపారికి అప్పగించడం సరికాదని అన్నారు.

ప్రైవేటుకు ఎలా..?

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఉపాధి కల్పన కోసం నిజాం సర్కారు హయాంలో వరంగల్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో అజంజాహి మిల్లును ఏర్పాటు చేశారు. మిల్లుతో 10 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కలిగేది. సామ్యక్య పాలకుల నిర్లక్ష్యంతో 2003లో ఈ మిల్లు మూతపడింది. అనంతరం మిల్లు స్థలాన్ని అప్పటి ప్రభుత్వం ఎక్కువ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది.

కొంత స్థలాన్ని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ఇచ్చింది. మిల్లులో పనిచేసే కార్మికుల కోసం 1,450 గజాల స్థలాన్ని అప్పట్లో మిల్లు యాజమాన్యం కేటాయించింది. 75 ఏండ్ల క్రితం ఈ స్థలంలో కార్మిక భవన్‌ను నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల అధికార పార్టీ నేతల కన్నుపడింది. ప్రైవేట్ వ్యాపారితో కలిసి ఈ స్థలంలో కాంప్లెక్సు నిర్మాణం కోసం ఏకంగా భూమిపూజ చేయడం వివాదానికి కారణమైంది.

మిల్లు భూమిని పరిరక్షించాలి

- కార్మిక భవనాన్ని పునర్నిర్మించాలి
- వామపక్ష పార్టీల డిమాండ్
- శివనగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం
- కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అదనపు కలెక్టర్‌కు వినతి

అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతి పత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రమేశ్

ఖిలావరంగల్, డిసెంబర్ 18 : కార్మికుల రక్తంతో నిర్మించిన అజంజాహి మిల్లు కార్మిక భవనాన్ని అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, కార్పొరేట్ శక్తులు కలిసి బుల్డోజర్లు పెట్టి దౌర్జన్యంగా కూల్చివేయడాన్ని వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు బుధవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శివనగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికుల భవనాన్ని కూల్చివేయడం పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చర్యగా దుయ్యబట్టారు. 250 ఎకరాలున్న అజంజాహి మిల్లు భూములను ప్లాట్ల రూపంలో అమ్ముకొని 96 ఎకరాల వరకు కుదించారన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ కుమ్మక్కై కార్మిక భవనాన్ని అక్రమంగా కూల్చడం చట్టరీత్యా నేరమని, వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ కూల్చివేతలకు ఎలా అనుమతిచ్చారన్నారు. కలెక్టర్, మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య స్పందించి కూల్చివేత అనుమతులను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూల్చిన భవనాన్ని పునర్నిర్మించేలా అసెంబ్లీలో తీర్మానించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, పనాస ప్రసాద్, బండి కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, యాదగిరి, రమక్క, రత్నమాల, బాబు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

అజంజాహి మిల్లు కార్మికుల భవనాన్ని కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కార్మికులకు న్యాయం చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. కార్మికుల భవనాన్ని తప్పుడు పత్రాలతో ఆక్రమించుకోవాలని చూస్తూ, భవనాన్ని కూల్చివేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, ఐతమం నాగేశ్ పాల్గొన్నారు.

వరుస హత్యలు.. నగరం బెంబేలు

- సీపీ నైట్ పెట్రోలింగ్ చేసిన కొన్ని గంటల్లోనే ఎస్సారార్ తోటలో హత్య
- ఈ ఏడాది 35 హత్యలు, 102 హత్యాయత్నాలు
- నేర నియంత్రణపై కరువైన నిఘా

సుబేదారి, డిసెంబర్ 18 : నగరంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల రంగంపేటలో కారులో వృద్ధుడి హత్య జరిగిన కొద్దిరోజులకే ఎఆర్ఆర్‌తోటలో బుధవారం తెల్లవారుజామున బీహార్ యువకుడు హత్యకు గురికావడం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఇప్పటికే లెక్కకు మించిన చోరీలు, దోపిడీలు, రౌడీషీటర్ల ఆగడాలకు తోడు ఈ వరుస మర్డర్లు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. పోలీసు రికార్డుల ప్రకారం కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 35 హత్యలు, 102 హత్యా ప్రయత్నాలు జరుగడం పెరుగుతున్న నేర తీవ్రతకు అద్దంపడుతోంది. మిల్స్‌కాలనీ, మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్, కాజీపేట, కేయూ సీ, హసన్‌పర్తి స్టేషన్ల పరిధిలో నేరాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అయితే సీపీ అంబర్ కిషోర్‌ఝా మంగళవారం అర్ధరాత్రి చార్‌బౌలి, పాశక్ మహల్, రంగంపేటలో పెట్రోలింగ్ చేసిన కొద్ది గంటల్లోనే ఎస్‌ఆర్ఆర్ తోటలో బీహార్‌కు యువకుడి హత్య జరగడం కలకలం రేపింది.

రాత్రివేళ నిఘా ఎక్కడ?

నగరంలో కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలు చూస్తేరాత్రివేళ నైట్ పెట్రోలింగ్ సైలెంట్ అయిందా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పోలీసులు, సిటీ రౌండ్ ఆఫీసర్ మొక్కుబడిగా కొన్ని ప్రాంతాల్లో చక్కర్లు కొడుతున్నారా? మిడ్ నైట్ తర్వాత ఎక్కువ సేపు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల వద్ద టీపాయింట్ల వద్దే ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. రంగంపేట, ఎఆర్ఆర్‌తోటలో జరిగిన రెండు హత్యలు కూడా రాత్రి సమయాల్లోనే జరిగాయి. నేర నియంత్రణలో ముందుగా సమాచారం సేకరించి స్థానిక పోలీసులకు అలర్ట్ చేయాల్సిన నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారులు పోస్టింగ్ ఇప్పించిన అధికార పార్టీల నేతల కనుసన్నుల్లో పనిచేస్తూ, శాంతిభద్రతలను పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లోకో మోటివ్ పీఓహెచ్‌కు మానుకోట అనుకూలం

దక్షిణ మధ్య రైల్వేలో అనువైన ప్రాంతంగా గుర్తింపు

- ప్రజాప్రతినిధులు చొరవ చూపితే మార్గం సుగమం
- వర్క్‌షాప్ ఏర్పాటైతే 10వేల మందికి ఉపాధి
- ప్రభుత్వం ప్రతిపాదిస్తే మహబూబాబాద్ అభివృద్ధికి ఊతం

మహబూబాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ) : రైళ్ల నిర్వహణలో అత్యంత కీలకమైన వాటిలో పీరియాడికల్ ఓవర్ హాలింగ్ ఒకటి. రైళ్లలో ఏర్పడే సమస్యలను పరిష్కరించేందుకు దెబ్బతిన్న పరికరాలను మార్చేందుకు ఈ షెడ్లు ఉపయోగపడతాయి. దక్షిణ మధ్య రైల్వేలో లోకోమోటివ్(రైలు ఇంజిన్) ఓవర్ హాలింగ్ షెడ్లు ఇప్పటివరకు లేవు. లోకోమోటివ్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్(పీఓహెచ్) ఏర్పాటు చేయాలంటే కనీసం జోన్ పరిధిలో 800 లోకోలు ఉంటే వాటి నిర్వహణ కోసం పీఓహెచ్ ఏర్పాటుచేస్తారు. సికింద్రాబాద్‌లో 1100కి పైగా లోకోలు ఉన్నప్పటికీ లోకోమోటివ్(పీఓహెచ్) లేదు. ఈ క్రమంలో గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో లోకోమోటివ్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ షెడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో పీఓహెచ్ వర్క్‌షాపు అందుబాటులో లేకపోవడంతో ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. కొత్తగా లోకో మోటివ్ షెడ్డు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. దక్షిణ మధ్య రైల్వేలో అటు ఆంధ్రప్రదేశ్‌కు, ఇది తెలంగాణకు మధ్యలో ఉన్న మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేస్తే అన్నింటికీ అనుకూలంగా ఉంటుంది. చెన్నయ్ నుంచి న్యూఢిల్లీ, భువనేశ్వర్ నుంచి ముంబై నగరాలను కలిపే ప్రధాన రైలు మార్గం ఈ ప్రాంతంలో ఉండడం కలిసొచ్చే అంశం. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే మార్గం సుగమం అవుతుంది. మహబూబాబాద్ పట్టణంలో డంపింగ్ యార్డు సమీపంలో సుమారు 865 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో వర్క్‌షాపు నిర్మిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

పీఓహెచ్ ప్రతిపాదిత ఏర్పాటుకు సూచించిన ప్రభుత్వ భూమి ఇదే

లోకో మోటివ్ ఓవర్ హాలింగ్‌కు అవకాశం

పీఓహెచ్ అంటే పీరియాడిక్ ఓవర్ హాలింగ్. ఇది లోకో మోటివ్(రైలు ఇంజిన్) నిర్వహణకు ఉపయోగపడుతుంది. పీఓహెచ్ సమయం లో రైలు ఇంజిన్లకు పలు మరమ్మతులు చేస్తారు. రైలు ప్రారంభమైన తర్వాత గమ్యస్థానం చేరేలోపు తలెత్తే చిన్న చిన్న మరమ్మతులు ఆల స్యం కాకుండా పూర్తి చేసే వీలుంటుంది. లోకోమోటివ్ క్యామ్లా షాప్ట్ లు, క్రాంక్ షాప్ట్‌లను శుభ్రం చేస్తారు. వాటిని పరీక్షించి కాలం చెల్లిన వాటిని కొత్త వాటితో భర్తీ చేస్తారు. పిస్టన్లు, కనెక్ట్ చేసే రాడ్, సిలిండర్ హెడ్లను శుభ్రం చేస్తారు. సిలిండర్లను ఓవర్ హాలింగ్ చేయడంతో పాటు లోపభూయిష్ట భాగాలను కొత్త వాటితో భర్తీ చేస్తారు. నీరు సరఫరా అయ్యే మార్గాలను పరీక్షించి పగుళ్లను గుర్తిస్తారు. వాల్స్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించి మరమ్మతు చేస్తారు. వాల్వ్, సీటుకు సంబంధించి రిపేర్లు చేస్తారు. లోకో సామర్థ్య పరీక్ష నిర్వహిస్తారు. రోటర్ బ్యాలెన్సిం గ్, కొత్త ఆయిల్ సీల్స్, సీలెంట్ గాస్కెట్లు, ఫౌండేషన్ బోల్ట్‌లను అమరుస్తారు. ఎలక్ట్రికల్ లోకోమోటివ్‌ల కోసం పీఓహెచ్ ఆవర్తన వ్యవధి 18 ఏళ్లుగా ఉంటుంది. లోకో తిరిగిన దూరం 24లక్షల కిలోమీటర్లు రెండింటిలో ఏది ముందైతే లోకోమోటివ్ పూర్తిగా మరమ్మతు చేస్తారు.

కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

మానుకోట రైల్వే ట్రాక్ ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో పీఓహెచ్ షెడ్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే రైల్వే మంత్రికి విజ్ఞప్తులు వెళ్లాయి. దక్షిణ మధ్య రైల్వేలో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను పూర్తిస్థాయిలో ఓవర్ హాలింగ్ చేసే వ్యవస్థ సికింద్రాబాద్ జోన్‌లో లేదు. ప్రస్తుతం ఓవర్ హాలింగ్ కోసం కాంచీపురంలోని బుస్వాల్ షెడ్డుకు లోకోలను పంపుతున్నారు. రాష్ట్రంలో పీఓహెచ్ షెడ్ లేని కారణంగా స్థానిక ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు కొంతమందిని తమిళనాడుకు పంపుతున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే మహబూబాబాద్ రైల్వేలో నూతన అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

10వేల మందికి ఉపాధి అవకాశాలు

మానుకోట జిల్లాకేంద్రంలో పీరియాడిక్ ఓవర్ హాలింగ్ షెడ్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి దొరుకుతుంది. ఈ జిల్లాలో ఎక్కువగా గిరిజనులు ఉన్నందున ఈ షెడ్డు నిర్మాణం జరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. మానుకోట ఎంపీతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పీఓహెచ్ ఏర్పాటుకు కృషిచేయాలి.

– ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

ఎలక్ట్రిక్ లోకో మోటివ్ పీరియాడిక్ ఓవర్ హాలింగ్ షెడ్ల ఏర్పాటుకు అన్ని రకాల వనరులు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించి మహబూబాబాద్‌లో వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. 5వేల మందికి ప్రత్యక్షంగా, మరో 5వేల మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు చొరవ చూపాలి. సికింద్రాబాద్ జోన్‌లో పీఓహెచ్ వర్క్‌షాప్ లేకపోవడం వల్ల తమిళనాడు పెరంబూర్, ఒడిశాలోని బుస్వాల్‌కు వెళ్లడం వల్ల అధిక భారం, సమయం